క్లుప్తంగా

చీరాలలో పర్యటించిన మంత్రి విశ్వరూప్


మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న అమృతపాణి, నాయకులు

చీరాల అర్బన్: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపె విశ్వరూప్ గురువారం చీరాలలో వచ్చారు. చీరాలలో జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చారు. అనంతరం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి నూతనంగా ఏర్పాటు చేసిన అమ్మ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్‌కు వచ్చారు. మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. హాస్పిటల్‌లోని నూతన విభాగాలను ఆయన పరిశీలించి వరికూటి అమృతపాణితో మాట్లాడారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులతో కొద్దిసేపు మాట్లాడారు. అలానే రవాణా శాఖా అధికారులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్ పొత్తూరి సుబ్బయ్య, నాయకులు పాల్గొన్నారు.

నేడు శింగరకొండ తిరునాళ్లపై సమావేశం

అద్దంకి రూరల్: మార్చి 5తేది నుంచి 7వ తేదీ వరకు జరగనున్న జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రం శింగరకొండ వార్షిక తిరునాళ్ల నిర్వాహణపై శుక్రవారం చీరాల ఆర్డీవో సరోజిని ఆధ్వర్యంలో శింగరకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో సాయంత్రం 3 గంటలకు సమష్టి సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ కోటా శ్రీనివాసబాబు, కార్యనిర్వాహణాధికారి సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పావులూరులో నేత్రదానం


మున్నంగి కనకమ్మ


చినగంజాం: ఇంకొల్లు మండలంలోని పావులూరు గ్రామంలో గురువారం మృతి చెందిన మున్నంగి కనకమ్మ (100) నేత్రాలను వారి కుటుంబ సభ్యులు దానం చేశారు. రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో దాత కార్నియాలను గుంటూరు శంకర కంటి వైద్యశాల వైద్య నిపుణులు సేకరించారు. నేత్రాలను దానం చేసేందుకు సహకరించిన కుటుంబ సభ్యులు, దాత కుమారుడు మున్నంగి సుబ్బారెడ్డి, కుమార్తె అలవల సీతమ్మ, మనవళ్లు శ్రీనివాస రెడ్డి, వీరారెడ్డిలను రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి భవనం అంజిరెడ్డి, కరి కమలేశ్వరరావు, వంకాయలపాటి శ్రీమన్నారాయణ, రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు జట్టి వెంకటేశ్వర్లు, సోమేపల్లి రామ్మోహనరావులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పీ భద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం


వేడుకల్లో భాగంగా పూజలు చేస్తున్న భక్తులు

చీరాల టౌన్: వేటపాలెం గ్రామంలో సీతామలక్ష్మణ, ఆంజనేయస్వామి, భద్రావతి సమేత భావనారుషిస్వామి దేవస్థాన ప్రథమ వార్షికోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవంలో భాగంగా గణపతి వాస్తు కళా హోమం, పూర్ణాహుతి, సహస్ర నామార్చన, మహా పూర్ణాహుతి వేడుకలను పండితుల మంత్రోచ్ఛారణలతో ఘనంగా నిర్వహించారు. స్వామి వార్లను వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం


విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ప్రత్యేక అధికారి, ఎంపీడీవోలు

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రాష్ట్రంలో కార్పొరేట్ విద్య తరహా బోధనలతో పాటు పౌష్టికాహారం అందించడం చాలా గొప్ప విషయమని జిల్లా సహకారం శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి కేవీ రామారావు అన్నారు. గురువారం ఆయన మండలంలోని తిమిడెదపాడు గ్రామంలో ప్రాథమిక పాఠశాల, గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులతో కలసి ఆయన సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్ రమేష్‌బాబు, హెచ్ఎం జీ రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యం


డ్రైనేజీ ఏర్పాటుకు అధికారులతో మాట్లాడుతున్న ఆమంచి


కృష్ణమోహన్‌ను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్

పర్చూరు: గ్రామాల్లో సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. గురువారం పర్చూరులో ఆమంచి విస్తృత పర్యటన చేసి సమస్యలను తెలుసుకున్నారు. పర్చూరు బొమ్మల సెంటర్‌లోని వైఎస్సార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వంగవీటి రంగా విగ్రహాలకు ఆమంచి కృష్ణమోహన్ పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఆమంచిని దేవరపల్లి ఉప సర్పంచ్ తోకల కృష్ణమోహన్ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ పర్చూరు గ్రామంలో డ్రైనేజీ సమస్య లేకుండా ఉండటం కోసం సర్వే చేసి కచ్చా డ్రైన్లు ఏర్పాటు చేసి ఊరిలో ఎక్కడా నీరు నిలబడకుండా చేయాలన్నారు. అద్దంకి నాంచారమ్మ ఆలయం వెనుక ఉన్న ఎస్టీ కాలనీలో, వాటర్ ప్లాంట్, శ్మశానవాటిక, అంబేడ్కర్ కాలనీ, ఇందిరాకాలనీల్లో పర్యటించి అక్కడ ఉన్న సమస్యలను గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలకు సంబంధించిన ఎలాంటి సమస్యలనైనా తన దృష్టికి తీసుకురావాలని, దానిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని నాయకులు, కార్యకర్తలకు ఆమంచి కృష్ణమోహన్ భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకా ఆనందకుమారి, మండల కన్వీనర్ కఠారి అప్పారావు, సర్పంచ్ మల్లా అంజమ్మ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కోట ప్రసన్నాశ్రీనివాసరావు, పర్చూరు తూర్పు ఎంపీటీసీ ఎం. ఉదయకుమారి,మాజీ ఎంపీపీ కోట హరిప్రసాద్, కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు,కారంచేడు మండల కన్వీనరు దండా చౌదరి, మార్టూరు మండల కన్వీనరు పఠాన్ కాలేషావలి, ఉపసర్పంచ్ గాదె సురేష్, అద్దంకి నాంచారమ్మ ఆలయ చైర్మన్ ఒగ్గిశెట్టి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు తోకల కృష్ణమోహన్, లంకా శివ, జంగా అనీల్ కుమార్, కోఆప్షన్‌సభ్యులు షేక్ కాలేషా, యద్దనపూడి హరిప్రసాద్, మండల మహిళా అధ్యక్షురాలు తులసీ నాగమణి, ఆకుల హేమంత్, రావువారి ప్రసాద్, తులసీ అప్పారావు, కృష్ణంశెట్టి రమేష్, ఆర్. ఆంజనేయులు,తులసీ శివనాగేశ్వరరావు, అడపా సుధాకరరెడ్డి, ఉప్పలపాటి అనీల్, తులసి రాజా, చెరుకూరు సర్పంచ్ పేరం సుబ్బారావు, దగ్గుబాటి రామకృష్ణ, కంచెనపల్లి రమేష్, పేర్ని హరిబాబు, గొల్లపూడి సర్పంచ్ వై. రామకృష్ణ, ముత్యాల రాజేష్, వైస్ ఎంపీపీ పాలేరు వీరయ్య, ఇనగల్లు సర్పంచ్ విపిన్‌బాబు, కె.నాగేశ్వరరావు, ముప్పాళ్ల రాఘవయ్య, వార్డు సభ్యులు యేసమ్మ, మరియమ్మ, బాజీ, బాజమ్మ, కాల్వ అమ్మణి పాల్గొన్నారు.

బొబ్బేపల్లిలో ఆమంచికి ఘన స్వాగతం

మార్టూరు: నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్‌కు గురువారం రాత్రి మండలంలోని బొబ్బేపల్లి గ్రామంలో గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా బొబ్బేపల్లిలో పర్యటించిన ఆమంచి మండల, స్థానిక నాయకులతో కలిసి గ్రామంలోని వీధుల వెంట పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సర్పంచ్ తాళ్లూరి లావణ్య, కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు పెంటేల రామారావు, దండా వీరాంజనేయులు, దండా హరిబాబులు ఆధ్వర్యంలో 2 వేల మందికి అన్నదానం నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ, మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, గడ్డం మస్తాన్‌వలి, మండల, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న శాప్‌నెట్ చైర్మన్ చైతన్య

సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే జగనన్న ధ్యేయం

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

బల్లికురవ: పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. గురువారం కూకట్లపల్లి సచివాలయం పరిధిలో నాలుగో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పని తీరు తెలుసుకున్నారు. కాలనీలోని ప్రధాన సమస్యలను ఉపసర్పంచ్ సురభి మేరిబాబు, కాలనీ వాసులు చైతన్య దృష్టికి తెచ్చారు. పేదలకు ఆర్థిక భద్రత కల్పించేలా నవరత్నాలతో అనేక సంక్షేమ పథకాలను జగనన్న అందిస్తూ పారదర్శక పాలనతో దేశంలోనే నెంబర్ వన్ సీఎంగా గుర్తింపు పొందారని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి పాలన అందించలేదని, రాబోయే ఎన్నికల్లో కూడా జగనన్నను తిరిగి సీఎంగా ఆశీర్వదించాలని చైతన్య కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షుడు ఇప్పల వెంకట సుబ్బారెడ్డి స్థానిక నేతలు చింతల శ్రీనివాసరావు, ఇప్పల అంజిరెడ్డి, రామిరెడ్డి, జాన్‌డీర్ సుబ్బారెడ్డి, టీ.విజయభాస్కర్‌రెడ్డి, టీ. ఏడు కొండలు రెడ్డి, తాళ్ల రవీంద్రారెడ్డి, గుంటక నాగిరెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పథకాలు


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న వెంకటేష్

- గడప గడప కార్యక్రమంలో కరణం వెంకటేష్

చీరాల: గత ప్రభుత్వాలు సంక్షేమ పథకాలన్ని తమ పార్టీ కార్యకర్తలకు మాత్రమే అందించేవి.. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత అర్హతే ప్రామాణికంగా తీసుకుని పార్టీలకు అతీతంగా నవరత్నాల పథకాలతో పాటు ఇతర సంక్షేమ పథకాలు అందిస్తున్నారని నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. గురువారం వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీలోని సచివాలయ పరిధిలోని సంపత్‌నగర్ కాలనీ గడప గడప కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఒక వేళ అర్హత ఉండి పథకాలు అందకపోతే వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అలానే నియోజకవర్గంలో వందల కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఒక్క కొత్తపేట పంచాయితీ కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. కొత్తపేటలో కరణం వెంకటేష్‌కు మహిళలు హారతులిచ్చి నీరాజనాలు పలికారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి మూడేళ్లుగా ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరి వాసు, మారుబోయిన పాపారావు, చింతలపల్లి తులసి, డక్కుమల్ల రమేష్, యు.బాబీ, ఏకలవ్య, మున్సిపల్ కౌన్సిలర్లు చీమకుర్తి బాలకృష్ణ, మల్లెల లలిత, కె.యానాదిరావు, కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, కంపా అరుణ్, కోలా శివ, మహుమ్మద్, ఎస్.అనీల్, రియాజ్, కె.విజయప్రకాష్, ఆర్‌బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, దోనెంపూడి తిమోతి, జమ్మి ప్రసాద్, యాతం మేరిబాబు, క్రాంతి, గోలి గంగాధరరావు, కోడూరి ప్రసాద్‌రెడ్డి, షేక్ మస్తాన్, వార్డు కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సూచనలు పాటిస్తే మేలైన ఆర్థిక వృద్ధి


ఉద్యాన పంటలను పరిశీలించి రైతులకు సూచనలు అందిస్తున్న శాస్త్రవేత్తలు

చీరాల టౌన్: ఆకుకూరలు, కూరగాయలు, పూలతోటలు, పచ్చిమిర్చి పంటలను సాగు చేసే రైతులకు పంటల సాగులో మెళుకువలు అందిస్తున్న ఉద్యానశాఖ అధికారుల సూచనలు, సలహాలను పాటిస్తే రైతులకు ఆర్థిక వృద్ధి లభిస్తుందని వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు ఉమామహేశ్వరరావు, నాగేంద్రరెడ్డి సూచించారు. గురువారం మండలంలోని కావూరి వారిపాలెం గ్రామంలోని రైతులు సాగు చేస్తున్న ఉద్యాన పంటలైన పూలతోటలు, పచ్చిమిర్చి, ఆకుకూరలు, కూరగాయల పంటలను డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, పరిశోధన విద్యార్థులు పరిశీలించారు. గ్రామంలోని ఇసుక నేలల్లో సాగు చేస్తున్న ఉద్యాన పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పూల తోటలకు వచ్చే తెగుళ్ల నివారణకు సేంద్రియ పద్ధతులతో పాటు ఉద్యానశాఖ అధికారుల సూచనలు పాటిస్తే పంటల సాగు ఖర్చులు తగ్గడంతో పాటుగా అధికంగా లాబాలు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కె.రమణారెడ్డి, ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు, రైతులు ఉన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

పర్చూరు: రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్ర, ఆర్‌సీసీ నాగులపాలెం వారి సంయుక్త నిర్వహణలో కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో 11వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు నాగులపాలెం బధిరుల పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండె, ఎముకలు, కీళ్లనొప్పులు, చర్మ, గొంతు, ముక్కు, చెవి, దంత,కంటి, పిల్లలకు, స్త్రీలకు సంబంధిత, సాధారణ వ్యాధులకు సంబంధించినవి చూస్తారని పేర్కొన్నారు. అవసరమైనవారికి ఈసీజీ, 2–డీ ఎకో పరీక్షలు ఉచితంగా చేయబడునని తెలిపారు. వివరాలకు 94409 88971 నంబరును సంప్రదించాలని కోరారు.

పోషకాహారంతో ఆరోగ్యవంతమైన బిడ్డ


అద్దంకి: గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ నవ్యారెడ్డి


కారంచేడులో గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జెస్సీరాణి

అద్దంకి: పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన బిడ్డకు జననం ఇవ్వొచ్చని మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్ జయచంద్రరరావు అన్నారు. వైద్యశాలలో శుక్రవారం గర్భిణులకు ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా 79 మంది గర్భిణులకు డాక్టర్ జయచంద్రరావు, డాక్టర్ నవ్యారెడ్డి హిమోగ్లోబిన్, యూరిన్, హెచ్ఐవీ, షుగర్, బీపీ, పరీక్షలను నిర్వహించారు. 9 మందిని స్కానింగ్ కోసం సిఫార్సు చేశారు. ఈ సదర్భంగా డాక్టర్ జయచంద్రరావు మాట్లాడుతూ గర్భిణులు ఆకు కూరలు, పండ్లు తినాలని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నీలం రామకోటేశ్వరరావు, ఆరోగ్య పర్యవేక్షకురాలు బీ సంపత్‌కుమారి, ఆరోగ్య కార్యకర్తలు, యేసమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కారంచేడు: గ్రామాల్లో రక్తహీనతతో ఇబ్బందులు పడే గర్భిణు పట్ల మరింత శ్రద్ధ వహించాల్సి ఉందని కారంచేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జెస్సీరాణి అన్నారు. గురువారం ఆమె మండల కేంద్రం కారంచేడు పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె గర్భిణులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సువర్ణ జ్యోతి, హెచ్‌వీలు వీరమ్మ, వసంతవల్లి, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, స్టాఫ్‌నర్స్‌లు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుతో మేలు


మాట్లాడుతున్న ఏడీఏ ఏవోలు

బల్లికురవ: రబీలో పంటలసాగుచేసిన రైతులంతా ఈనెల 15వ తేదీలోపు పంట నమోదుతో ఈ–కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం గుంటుపల్లి, అంబడిపూడి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో రైతులతో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. 13 విడత పీఎం కిసాన్ సమ్మాన్ యోజన లబ్ధి పొందుతున్న రైతులతా ఈ–కేవైసీ చేయించుకోవాలని కోరారు. సమావేశాల్లో ఏవో ఎస్వీపీ కుమారి, వైద్యాధికారిణి ఆర్. పావనికుమారి పాల్గొని మాట్లాడారు.

వైఎస్సార్ బీమా వరం


బీమా సొమ్ము అందజేస్తున్న సెక్రటరీ, స్థానిక నేతలు

బల్లికురవ: కుటుంబంలో సంపాదనపరుడైన వ్యక్తి చనిపోతే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వ ప్రవేశపెట్టిన వైఎస్సార్ బీమా ఒక వరమని వేమవరం సెక్రటరీ బీ. ప్రసాదరావు అన్నారు. గురువారం గ్రామానికి చెందిన రావిశెట్టి రామబ్రహ్మం (47) చనిపోగా ఆయనభార్య లక్ష్మీకి మట్టి ఖర్చుల క్రింద తక్షణమే రూ. 10 వేలు అందజేశారు. మిగిలిన సొమ్ము రూ. 90 వేలు డాక్యుమెంటేషన్ పూర్తి చేసి ఇస్తే అందజేస్తామని సెక్రటరీ వివరించారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ యం. శివ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

వంద శాతం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ప్రసాద్

జే.పంగులూరు: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో జగనన్న లే ఔట్లలో గాని, సొంత స్థలాల్లో ఉన్న ఇళ్ళ నిర్మాణాలు నూటికి నూరు శాతం పూర్తి చేయించాలని హౌసింగ్ పీడీ, మండల ప్రత్యేకాధికారి కేఎంజీజేవీఆ ప్రసాద్ అధికారులకు సూచించారు. మండల పరిధిలోని పంగులూరు–2 సచివాలయాన్ని గురువారం హౌసింగ్ పీడీ ప్రసాద్ పరిశీలించారు. కార్యక్రమానికి ముందు పంగులూరు గ్రామంలోని జగనన్న లేఔట్లను పరిశీలించారు. అంనతరం అధికారులతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేని వారిని గుర్తించి వారికి ఐకేపి ద్వారి రూ. 35 వేలు లోను ఇప్పించి వారి నిర్మాణం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ జేఈ కిశోర్, ఏవో సుబ్బారెడ్డి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

11న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

అద్దంకి రూరల్: ఈనెల 11న అద్దంకి రాజీవ్ నగర్‌లో వేంచేసియున్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానలో స్వామి అమ్మవార్ల 13వ వార్షిక కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు టీ.రవీంద్రా రెడ్డి గురువారం తెలిపారు. దీనిలో భాగంగా విఘ్నేశ్వర పూజ, చండీయాగం, ప్రత్యంగిరా హోమం, సుబ్రహ్మణ్యేశ్వర హోమం నరఘోష యాగం నిర్వహిస్తారని తెలిపారు. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఇంటి పన్ను వసూళ్లు పూర్తిచేయాలి


మాట్లాడుతున్న డీఎల్‌పీ శ్రీనివాసరావు

జే.పంగులూరు: ఈనెలాఖరు కల్లా ఇంటిపన్ను వసూళ్లు పూర్తి చేయాలని డీఎల్‌పీ కే శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. మండల పరిధిలోని పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మూడు మండలాల పంచాయతీ కార్యదర్శుల సమీక్షా సమావేశం డీఎల్‌పీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకొల్లు మండలంలో ఇంటి పన్ను రూ.3.29 కోట్లు వసూళ్లు చేయాల్సి ఉండగా ఇప్పటికి రూ. 1.58 కోట్లు వసూళ్లు అయినట్లు తెలిపారు. జే.పంగులూరు రూ. 1.28 కోట్లకు గాను రూ. 0.60 లక్షలు, కొరిశపాడు రూ. 2.14 కోట్లకుగాను రూ. 1.25 కొట్లు వసూళ్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రాంబాబు, ఇంకొల్లు యూఓఆర్డీ శ్రీనివాసులు, కొరిశపాడు యూఓఆర్డీ కోటేశ్వరమ్మ, ఈసి మురళిక్రిష్ణ, మూడు మండలాల పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మెనూలో నాణ్యత తప్పనిసరి..

బల్లికురవ: జగనన్న గోరుముద్దలో మంచిపౌష్టికాహారం లభిస్తుందని, మెనూ ప్రకారం శుచి రుచిగా ప్రతి రోజు వండి వడ్డించాలని చీరాల డీఎల్‌పీవో కే శ్రీనివాసరావు. కుకింక్ ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. గురువారం బల్లికురవలోని గ్రామ సచివాలయంలోని రికార్డులు, స్థానిక ఉన్నత పాఠశాల రెండు ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. తనిఖీలో ఈవోఆర్డీ జీ. సీతామహాలక్ష్మి, గ్రామ పంచాయతీ సెక్రటరీ కుమారస్వామి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు పాల్గొన్నారు.

అక్రమ రేషన్‌బియ్యం స్వాధీనం


వాహనాన్ని పట్టుకున్న ఎస్సై జనార్దన్, సిబ్బంది

చీరాల: ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా మినీ లారీలో తరలిస్తుండగా పోలీసులు గురువారం పట్టుకున్నారు. రూరల్ ఎస్సై పీ జనార్దన్ వివరాల మేరకు.. రూరల్ సీఐ మల్లికార్జునరావు ఆదేశాలతో గురువారం ఈపురుపాలెం గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఈపురుపాలెం నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న ఏపీ 39 టీటీ 2090 మినీలారీలో అక్రమంగా తరలిస్తున్న 72 బస్తాలు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వాహన డ్రైవర్ వెంకటేశ్వర్లు ఈపురుపాలెం, తదితర ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి వాహనంలో ఒంగోలు వైపుకు తరలిస్తుండగా పట్టుకున్నామని, డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నామన్నారు. సీజ్ చేసిన రేషన్ బియ్యం, మినీ లారీని స్టేషన్‌కు తరలించామని పూర్తి వివరాలు విచారణలో తేలుతాయని ఎస్సై తెలిపారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు


కార్యాలయంలోని రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

యద్దనపూడి: సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు విధుల్లో అలసత్వం వహించకుండా తమ విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఎంపీడీవో కృష్ణకుమారి అన్నారు. గురువారం మండలంలోని అనంతవరంలోని సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరు, రికార్డులు, గృహనిర్మాణ ప్రగతి, కార్యాలయంలోని పెండింగ్ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయంలోని సిబ్బంది ఇన్‌టైమ్‌లో బయోమెట్రిక్ హాజరు వేయటం లేదని, సర్వీస్‌సేవలు తక్కువగా ఉన్నాయని గుర్తించి సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నక్కా శ్రీనివాసరావు, సర్పంచ్ షేక్ మస్తాన్‌బీ, ఉప సర్పంచ్ షేక్ శ్రీనివాసరావు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.